క్లుప్తంగా

రోడ్లపై అపరాల నూర్పులతో అవస్థలు



జనార్దనపురం రోడ్డుపై వేసిన పెసర పంట

బలిజిపేట: ప్రధాన రహదారులపై అపరాల పంట నూర్పులు జరుపుతుండడంతో వాహనచోదకులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారిపై వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకుండా రోడ్డుపై పూర్తిగా పంటను పడేయడంతో వాహనచోదకులు రోడ్డు పక్కకు వెళ్లేందుకు వీలులేకుండా ఉండడంతో ప్రమాదాలకు గురవుతున్నామని తెలుపుతున్నారు. అపరాల పంట ఎండిన తరువాత రోడ్డుపైనే గాలికి ఎగురవేయడంతో దుమ్ము, ధూళి వాహనాలపై వచ్చేటప్పుడు కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నామని తెలిపారు. పోలీస్ శాఖ వీటిని నియంత్రించాలని కోరుతున్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీలు ఆవిష్కరిస్తున్న అధికారులు

బలిజిపేట: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ జిల్లా శాఖ డైరీలు, క్యాలెండర్లు, స్టిక్కర్లను ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, అధికారులు ఆవిష్కరించారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రవికుమార్ మాట్లాడుతూ డైరీలలో మంచి సమాచారాన్ని పొందుపరచారని, ఇది ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఎంఈఓ-1 సామల సింహాచలం, ఏఓ భానుమూర్తి, యూనియన్ ప్రతినిధి విక్టర్, టైపిస్ట్ శ్రీనివాస్, నాయకులు వెంకటరమణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పార్వతీపురం: గిరిజన విద్యార్థుల వసతిగృహాలకు మౌలిక సదుపాయాలను కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘ నాయకులు పి.సురేష్, జి.వెంకటరమణ, పవన్‌కుమార్ కోరారు. మండలంలోని డోకిశీల వసతి గృహంలో విద్యార్థులతో వారు గురువారం సమావేశం నిర్వహించారు. వసతిగృహంలో తాగునీటి సమస్య నెలకొందన్నారు. మరికొద్ది రోజులలో వేసవి రానున్న తరుణంలో వసతిగృహలలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను కోరారు.

నవనీతాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి



నవనీతం అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది సమీపంలో వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి నవనీతం అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనృసింహస్వామి వారిని ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు గురువారం వేకువజాము నుంచి స్వామివారిని వెన్నతో అలంకరించి వివిధ రకాల పూలతో అలంకరణ చేసిన అనంతరం భక్తుల దర్శనార్థం అనుమతి నిచ్చారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పూజలు జరిపించారు.

గృహ నిర్మాణ సంస్థ క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న హౌసింగ్ పీడీ రమేష్

పార్వతీపురం టౌన్: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రూపొందించిన డైరీని హౌసింగ్ పీడీ రమేష్ గురువారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ డైరీలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి వివరాలు పూర్తి స్థాయిలో నిక్షిప్తమై ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఈ డైరీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్య నిర్వాహక ఇంజనీరు మోహనరావు, జి.సోమేశ్వరరావు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పంచాయతీ గ్రామాలు

విలీనమయ్యే ప్రసక్తే లేదు..

- మున్సిపల్ ప్రజాప్రతినిధులు, నాయకులు



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: సాలూరు మున్సిపాలిటీలో పరిసర పంచాయతీలైన జీగిరాం, నెలిపర్తి, కూర్మరాజుపేట పంచాయతీ గ్రామాల విలీనమయ్యే ప్రసక్తే లేదని, ప్రజలు దీనిపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు అన్నారు. మున్సిపాలిటిలోని రామా థియేటర్ ఆవరణలో స్థానిక విలేకరులతో వారు గురువారం మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ పాలనలో ఈ పంచాయతీ గ్రామాలు మున్సిపాలిటిలో విలీనానికి నిర్ణయించి తెరతీసిందని అన్నారు. నాడు ఈ పంచాయతీ ప్రజల అభిప్రాయం మేరకు నాటి ఎమ్మెల్యే, నేటి ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఈ ప్రతిపాదనను నిలుపుదల చేయించారని గుర్తు చేశారు. 2041వ సంవత్సరంలో గ్రేడ్ వన్ మున్సిపాలిటిగా చేయడానికి హద్దులు అడిగారని, మున్సిపాలిటిలో గ్రామాల విలీనానికి ప్రభుత్వం జీఓలు జారీ చేయలేదని స్పష్టం చేశారు. పంచాయతీల అభిప్రాయాలు లేకుండా విలీనాలు సాధ్యం కాదని తెలిపారు. రాష్ట్ర విభజన అయిపోయిందని, ఇప్పుడు మున్సిపాలిటీలను పెద్దవి చేసే వీలుకాదని, పంచాయతీలను మున్సిపాలిటిలో చేర్చడానికి మున్సిపల్ ప్రజలు, పాలక మండలికి కూడా ఇష్టం లేదని తెలిపారు. పంచాయతీలను మున్సిపాలిటిలో చేర్చడానికి ప్రజలతో పాటు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర సైతం వ్యతిరేకంగా ఉన్నారని పునరుద్ఘాటించారు. గ్రామాల విలీన ప్రక్రియ లేదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాపాక మాధవరావు, గొర్లె వెంకటరమణ, పిరిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై ఫిర్యాదు



ఎస్ఐ నారాయణరావుకు కు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పాచిపెంట: పథకాలు వస్తాయంటూ మాయమాటలు చెప్పి ప్రజల నుంచి వ్యక్తిగత, కుటుంబ వివరాలను నమోదు చేసుకుంటున్న టీడీపీ నాయకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్రనాథ్, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, ప్రజాప్రతినిధులు తదితరులు కోరారు. ఈ మేరకు గురువారం వారు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నారాయణరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొంతమంది వ్యక్తులు ప్రజల వద్దకి వచ్చి, తాము టీడీపీ నాయకులమని తెలుపుతూ, టీడీపీ అధికారంలోకి వస్తుందని, బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కింద పథకాలు మంజూరు చేస్తామని చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో పథకాల కోసం మోసం చేస్తూ ప్రజల వ్యక్తిగత, కుటుంబ వివరాలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు.

అమాయక గిరిజనులు, దళితులు, బీసీలే లక్ష్యంగా టీడీపీ నాయకులు ఈ వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఇటీవల మండలంలో పాచిపెంట, కోనవలస తదితర పంచాయతీలలో ఈ విధంగా జరిగిందని ఉదహరించారు. ప్రజలు వ్యక్తిగత వివరాలు టీడీపీ నాయకులు తెలుసుకోవడం ద్వారా ప్రజలకు నష్టం చేకూరే ప్రమాదం ఉందని, ఓట్లు తొలగించవచ్చని వివరించారు. పై విషయాలపై అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేసి సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సీతానగరం: ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో చేపట్టిన సీసీ కాలువలు, రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి అన్నారు. లచ్చయ్యపేట ఎస్సీ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు.

మండలంలో జరుగుతున్న పనుల పరిశీలన అనంతరం ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, కాలువలు లేని చోట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వినతులు రావడంతో ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు, సీసీ కల్వర్టులు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్ సహాయకుల పర్యవేక్షణలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు ఎం.బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు అక్కపోలు సింహాచలం, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, ఇంజినీరింగ్ సహాయకులు ఉన్నారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక



మాట్లాడుతున్న ఆడిట్ మోనటరింగ్ అధికారి గౌరీశంకరరావు

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక ప్రజా వేదిక గురువారం నిర్వహించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన వేదికలో మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై చర్చించారు. సచివాలయ భవనాలకు రూ.21 కోట్లతో చేసిన పనులకు సంబంధించి తనిఖీ బృందం ఇచ్చిన నివేదికలపై నిర్ణయం తీసుకున్నారు. కొన్ని పంచాయతీల్లో మస్తర్ల దిద్దుబాటు, వలంటీర్లు ఆరు రోజులు పనులకు వెళ్లడంపై వారితో రికవరీ చేయించారు. సూరంపేట, సీతారాంపురం, పెదంకలాం, రోడ్డు వైండింగ్‌లో వేసిన మొక్కలు చనిపోయినట్టు గుర్తించారు. ఆర్‌డబ్ల్యూఎస్ పీఐయూ శాఖల అధికారులు రికార్డులు ఆలస్యంగా పొందుపరచడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా వేదికలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ నాయకులు బి.శ్రీరాములునాయుడు, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, సోషల్ ఆడిట్ రాష్ట్ర మోనటరింగ్ పర్సన్లు వై.గౌరీశంకరరావు, ఎస్ఆర్‌పీ ఎం.తిరుపతిరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, సీడీసీ మాజీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, ఆరుగురు డీఆర్‌పీల బృందం, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఏపీఓ భాను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

కురుపాం:

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జ్యోతీబా పూలే, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు లలిత, రామ్మోహన్‌రావు, మురళీకృష్ణ, రామకృష్ణ, ఎల్లంనాయుడు, నిర్మలాజ్యోతి, స్వప్న, సతీష్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు, కోర్సులు, విద్యాబోధన, సదుపాయాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారంతా వచ్చే ఏడాది ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులను ప్రభుత్వం ఎన్నో విధాలుగా ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

11న టిడ్కో ఇళ్ల గృహ సముదాయాల ప్రారంభం

సాలూరు: పట్టణంలోని గుమడాం సమీపంలో చంద్రంపేట వద్ద నిర్మించిన ఏపీ టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవం ఈ నెల 11న జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.82.85 కోట్లతో నిర్మించిన 1056 జి+3 టిడ్కో ఇళ్లను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నారని తెలిపారు.

అభ్యసనాభివృద్ధి పరిశీలన



బలిజిపేట ఉన్నత పాఠశాలలో లిప్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈఓ 1 సామల సింహాచలం తెలిపారు. లిప్ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఆయన గురువారం బలిజిపేట, పెదపెంకి ఉన్నత పాఠశాలల్లో బోధనా పద్ధతులను పరిశీలించారు. లిప్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఇది అవసరమన్నారు. తెలుగు, సైన్స్, ఆంగ్లం, సోషల్, గణితం సబ్జెక్టు ఉపాధ్యాయులు లిప్ విధానంలో బోధిస్తున్న తీరును ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లిప్ రికార్డులను పరిశీలించారు. అనంతరం రివ్యూలో ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు అందించారు. విద్యార్థులను పరీక్షించి లిప్ విధానంలో విద్యాబోధనపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు



సాంఘిక సంక్షేమ వసతి గృహంలో వంటకాలు పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

కురుపాం: మండల కేంద్రంలోని విద్యార్థులకు చెందిన పలు వసతిగృహాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మెనూ ప్రకారం వంటకాలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహాన్ని సందర్శించిన ఆయన ఆ తర్వాత వరుసగా బీసీ వసతిగృహాన్ని, జ్యోతీబాపూలే గురుకుల బాలురు ఆశ్రమ పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలురు పాఠశాలకు వెళ్లి, అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ క్రమంలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనం వంటకాలను రుచి చూశారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, ప్రతిరోజూ మెనూ ప్రకారం వంటకాలు చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ వసతిగృహ సంక్షేమ అధికారికి మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ డీడీలు, డీఎస్‌వో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పరిశీలన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను మండల స్థాయి లిప్ మానటరింగ్ టీమ్ గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆరు నుంచి ఎనిమిది తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. టీచింగ్, ప్రాక్టీస్ పీరియడ్‌ల నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లిల్లీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: అసెంబ్లీ సమావేశాల నిమిత్తం తాడేపల్లి వెళ్లిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజ కవర్గ సమస్యలు, అభివృద్ధిపై ముఖ్యమంత్రికి తెలియజేసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

చిన్నారుల మరణాల రేటు తగ్గించాలి



నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించిన అధికారులు

బలిజిపేట: ఏడాదిలోపు చిన్నారులు, మాతా, శిశు మరణాల రేటు తగ్గించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్‌నాయుడు అన్నారు. తన కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోపు చిన్నారుల మరణాల రేటు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. మాతా, శిశు మరణాల రేటు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అందుకుగాను పంచాయతీరాజ్, ఐసీడీఎస్, వైద్యశాఖలు సంయుక్తంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, ఎంఈఓ-1సామల సింహాచలం, ఈఓపీఆర్‌డీ రవికుమార్, ఏపీఎం ఉమామహేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో మహిళా సంఘాల అభివృద్ధి

బలిజిపేట: మహిళా సంఘాల అభివృద్ధికి ప్రణాళిక అవసరమని ఐబీ ఏపీఎం జయమ్మ సూచించారు. బలిజిపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉంటున్న మహిళా సంఘాల అభివృద్ధికి సంబంధించి, అవసరాలకు సంబంధించి పక్కా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. దీని వలన సంఘాలు బలోపేతం అవుతాయని, సంఘాల అభివృద్ధికి పునాదులు పడతాయని అన్నారు. వ్యక్తిగతంగా మహిళలు రాబోయే 5సంవత్సరాలలో ఏ విధంగా అభ్యున్నతి సాధించాలనే దానిపై ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఐబీ ఏపీఎం జయమ్మ

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై సమీక్ష

సీతానగరం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించడానికి పాల్గొనే సమయంలో వారికి అవసరమైన సదుపాయాలను కల్పించడానికి నివేదికలు అధికారులు తయారు చేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఎంపీడీఓ చాంబర్‌లో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, దివ్యాంగులకు అవసరమైన ర్యాంప్‌లు, తాగునీటి సౌకర్యం, రహదారి సౌకర్యం, పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, వృద్ధులకు రహదారి సౌకర్యాలు కల్పించడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు సెక్టోరియల్ అధికారులను నియమించడం వలన ఇప్పటి నుంచే పోలింగ్ కేంద్రాల వివరాలను సేకరణలో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమావర్మ, రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, ఆర్అండ్‌బీ ఏఈ రామ్మోహనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

వెంగళరాయపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో తనిఖీలు చేస్తున్న వైద్యాధికారిణి

బలిజిపేట: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వెంగళరాయపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇంటి వద్దకే వైద్యులు వచ్చి వైద్యసేవలు అందిస్తారని వైద్యాధికారిణి మాధురి తెలిపారు. అన్ని రకాల రోగాలకు వైద్యసేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. కదలలేని రోగులకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య శాఖ సిబ్బంది, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు ప్రసాదరావు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో జీసీసీ వ్యాపార లావాదేవీలు

- జీసీసీ పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: జీసీసీ(గిరిజన సహకార సంస్థ) వ్యాపార లావాదేవీలు లక్ష్యానికి చేరువలో ఉన్నాయని జీసీసీ పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ తెలిపారు. గురువారం స్థానిక జీసీసీ బ్రాంచి కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో కాసేపు మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డివిజనల్ పరిధిలో రూ.56 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని లక్ష్యంగా చేసుకున్నామని, ఇప్పటివరకు పెట్రోల్‌బంకులు, గ్యాస్‌గొడౌన్లు, డీఆర్ డిపోలు, కొనుగోలు కేంద్రాలు, సూపర్‌బజార్లు ద్వారా రూ.52 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించడం జరిగిందన్నారు. మరో రెండు నెలల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. అటవీ ఉత్పత్తులకు మద్దతుధరలు నిర్ణయించి, కొనుగోలు చేస్తున్నామన్నారు. పిక్కతో కూడిన చింతపండు కిలో రూ.32.40 రూపాయలకు, పిక్కతీసిన చింతపండు కిలో రూ.63, కాగు పప్పు కిలో రూ.22, ముషిడి గింజలు కిలో రూ.90, కరక్కాయలు కిలో రూ.18, విప్పపప్పు కిలో రూ.29, నల్లజీడి గింజలు కిలో రూ.18, కుంకుడుకాయలు కిలో రూ.60, ఇండుగ పిక్కలు కిలో రూ.60, తానికాయలు కిలో రూ.15, ఉసిరిపప్పు కిలో రూ.90, నరమామిడి చెక్క కిలో రూ.18 ప్రకటించి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.